సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి - 8లో ▸

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) జీపీఎస్.రాథోర్ అన్నారు.



ఫార్మసీతో కేయూ ప్రతిష్ఠ విశ్వవ్యాప్తం

యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ఠ విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
$33^{0}/24^{0}$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

7న భద్రకాళి దేవాలయం మూసివేత

హన్మకొండ కల్చరల్ : భాద్రపద శుద్ధ పూర్ణిమ ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతున్నందున భద్రకాళి దేవాలయాన్ని ఆరోజు మధ్యాహ్నం 1 గంటకు పూజల అనంతరం మూసివేయనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ రామల సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రహణమోక్షానంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ చేసి సోమవారం ఉదయం 7గంటలకు భక్తులకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

జిల్లాకు ఎస్సారెస్పీ జలాలు



హసన్‌పర్తి: ఎస్సారెస్పీ జలాలు గురువారం సాయంత్రం హనుమకొండ జిల్లాకు చేరాయి. చివరి (ఖమ్మం, నల్లగొండ) ఆయకట్టు వరకు నీరందించనున్నట్లు అధికారులు తెలిపారు. లోయర్ మానేరు నుంచి 3,000 క్యూసెక్కుల నీరు విడుదలైనట్లు, వార బందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ పంటకు నీరందిస్తామన్నారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 7న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కార్యదర్శి బేరే వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 13, 14 తేదీల్లో జనగామ జిల్లా కూనూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు మద్రాసులోని దిండిగల్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిలో క్రీడాకారులు 7న ఉదయం 9 గంటలకు జేఎస్ఎస్‌లోని బ్యాడ్మింటన్ గ్రౌండ్ వద్దకు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 98492 01467లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

గురుబ్రహ్మ అవార్డుకు రాంబాబు, సతీశ్‌మూర్తి



హసన్‌పర్తి/ ఖిలావరంగల్: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు, వరంగల్ కీవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ దాసి సతీశ్‌మూర్తి(ఎస్ఆర్ఎఫ్ ఎక్స్‌లెన్స్) రాష్ట్ర స్థాయి గురు బ్రహ్మ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం రాత్రి సురవరం ప్రతాప్‌రెడ్డి (పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ)లో నిర్వహించిన కార్యక్రమంలో లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నేడు రేషన్ షాపులు బంద్



హన్మకొండ అర్బన్/ ఖిలా వరంగల్: రేషన్ డీలర్లకు గౌరవ వేతనం, కమిషన్ పెంపు జాప్యంపై నిరసన తెలుపుతూ.. నేడు (శుక్రవారం) రేషన్ షాపులు బంద్ చేస్తున్నట్లు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జిల్లా ధారావత్ మోహన్ నాయక్ గురువారం వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లుగా రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, 21 నెలలు గడిచినా కమిషన్ పెంపు వర్తింపజేయకుండా జాప్యం, 5 నెలల కమిషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులను బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు నెలలుగా రేషన్ షాపుల్లో పాడైపోతున్న దొడ్డు బియ్యం నిలవలను తరలించేందుకు నిర్ణయం తీసుకోవాలని, క్వింటాలుకు రూ.140 నుంచి రూ.300కు కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఒక రోజు బంద్‌తోనైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్‌గా రాములు

హిందీపై పిల్లల్లో ఇష్టం పెంచేలా బోధన




విద్యారణ్యపురి: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ చెడిపాక రాములుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 5న హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గురు పూజోత్సవం అవార్డుల ప్రదానంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోబోతున్నారు.

సులభ పద్ధతిలో హిందీ బోధన

విద్యార్థుల్లో భాషపై ఇష్టాన్ని పెంచుతూ.. హిందీ బోధిస్తున్నారు. పేద విద్యార్థులకు పలకలు, త్రిభాషా డిక్షనరీలు, చార్టులు, పెన్సిళ్లు, స్కెచ్‌లు అందిస్తున్నారు. వృత్తి రీత్యా హిందీ స్కూల్ అసిస్టెంట్ అయినప్పటికీ ప్రవృత్తి పరంగా తెలుగులో పలు సినిమాపాటలు రాశారు. సోగ్గాడే శోభన్‌కృష్ణ, కేసీఆర్ బయోపిక్ ఉద్యమసింహం, నేను కీర్తన సినిమాలకు పాటలు కూడా రాశారు. 10 యూట్యూబ్ చానళ్లకు ఆయన రాసిన జానపద గీతాలు ప్రచారంలో ఉన్నాయి. ప్రైవేట్ ఆల్బమ్స్ 14 ఉన్నాయి. జానపద గీతాలు రచించి రాణిస్తున్నారు. 'మహాగేయ ప్రస్థానం' అనే పుస్తకాన్ని రచించారు. దేశభక్తి గీతాలు అందులో ఉన్నాయి. కవి, రచయిత గాయకుడిగా రాణిస్తున్నారు.రాములు తనకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

గురవేనమః



నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గురు స్థానం గొప్పది. రంగమేదైనా గురువుంటే గురి ఛేదించాల్సిందే. ఉపాధ్యాయులు తమ ఉద్యోగ జీవితంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి గురువుగా మారుతారు. పాఠ్యపుస్తకంలోని పాఠాలే కాకుండా బతుకు పాఠాలు నేర్పిన వారు కొందరైతే.. జీవితాల్ని నిలబెట్టిన వారూ మరెందరో.. బాధ్యతగల పౌరుల్ని తీర్చిదిద్ది సమాజంలో మంచిని పెంచడంలో గురువులే కీలకం. ఉపాధ్యాయ దినోత్సవం వేళ వారందరికీ గురవేనమః

మరిన్ని కథనాలు : 8లో

రెట్టింపు సంఖ్యలో బడికి



విద్యార్థులతో రమ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని చౌళ్లపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చల్లా రమ ప్రభుత్వ పాఠశాలపై ప్రజలకు మక్కువ కలిగిస్తున్నారు. పాఠశాలలో డ్రాపవుట్స్ లేకుండా.. విద్యార్థుల సంఖ్య 20 నుంచి 40కి చేరాలా కృషి చేశారు. 2024 జూన్‌లో చౌళ్లపల్లి పాఠశాలలో హెచ్ఎంగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఆకర్షనీయ కార్యక్రమాలు చేపడుతూ.. పిల్లల్ని పాఠశాలకు దగ్గర చేస్తున్నారు. విద్యార్థులతో కో కరిక్యులర్ యాక్టివిటీస్ చేయిస్తూ వారిని మరింత చురుకుదనాన్ని కలిగిస్తున్నారు. సంస్కృతీ సంప్రదాయాల్ని నేర్పిస్తూ.. వేడుకల్ని పాఠశాలలో నిర్వహిస్తూ సృజనాత్మకత పెంచుతున్నారు. మండల అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు.

నిమజ్జనం.. సర్వం సిద్ధం



హనుమకొండ బంధం చెరువు వద్ద నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లు



చిన్నవడ్డేపల్లి చెరువులో వినాయక నిమజ్జనానికి ఏర్పాటు చేసిన క్రేన్లు, లైటింగ్

నేడు బొజ్జ గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

- ప్రమాదాలకు తావులేకుండా అన్ని శాఖలు అప్రమత్తం
- నగరంలోని 19 కేంద్రాల్లో రూ.1.50 కోట్ల నిధులతో ఏర్పాట్లు
- 32 క్రేన్లు, 1,200 మంది గజ ఈతగాళ్లు
- ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పర్యవేక్షించిన మేయర్, కలెక్టర్లు, కమిషనర్, అధికారులు

వరంగల్ అర్బన్: విశేష పూజలందుకున్న బొజ్జగణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికేందుకు సర్వం సన్నద్ధమైంది. వరంగల్ మహా నగర వ్యాప్తంగా గణనాథులను వాహనాలపై కొలువుదీర్చి శోభాయాత్రతో ఆయా ప్రాంతాల్లోని 19 చెరువుల వద్ద శుక్రవారం నిమజ్జనం చేయనున్నారు. అందుకోసం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధి చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగ సముద్రం, గొర్రెకుంట కట్ట మల్లన్న, గుండు చెరువు అగర్తలా, మామునూరు బెస్తం చెరువు ల్లో నిమజ్జనం జరగనుంది. హనుమకొండ, కాజీపేటలోని సిద్దేశ్వర గుండం, బంధం చెరువు, హసన్‌పర్తి పెద్ద చెరువు, గోపాలపురం, భీమారం, కడిపికొండ, మడికొండ, సోమిడి, ఎల్లాపూర్, గుండ్ల సింగారం, రాంపేట, రాంపూర్, సింగారం, చల్ల చెరువు వద్ద నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేయర్, కలెక్టర్లు, పోలీస్, నగర కమిషనర్ ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు ఏర్పాట్లు దిశానిర్దేశం చేశారు. ఆయా కేంద్రాల్లో నిమజ్జనం కోసం బల్దియా రూ.1.50 కోట్లతో నిధుల్ని వెచ్చించింది. ఇక వివిధ శాఖల అధికారులు తమ పరిధి సౌకర్యాలు కల్పించారు.

ఏర్పాట్లు ఇలా..

- మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో 32 క్రేన్లను ఏర్పాటు చేశారు. వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద 7 క్రేన్లను, ఉర్సు రంగ సముద్రం 3, బెస్తం చెరువు, ఖిలా వరంగల్ అగర్తలా ఒకటి చొప్పున ఏర్పాటు చేశారు. హనుమకొండ సిద్ధేశ్వర గుండం వద్ద 3, బంధం చెరువుల వద్ద 3, హసన్‌పర్తి పెద్ద చెరువు 2, కడిపికొండ, భీమారం, చల్ల చెరువు వద్ద ఒకటి విలీన గ్రామాల్లో క్రేన్లను అందుబాటులో ఉంచారు.
- బల్దియా ఆధ్వర్యంలో రోడ్లు చదును చేసి, ప్యాచ్ వర్క్‌లు, రోడ్ల విస్తరణ ఇరువైపులకు రూ.35లక్షలు ఖర్చు చేశారు. అన్ని చెరువుల వద్ద జిగేల్‌మనేలా లైటింగ్ ఏర్పాటుకు రూ.14 లక్షలు కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో మంచినీటిని సరఫరా చేసేందుకు వాటర్ ట్యాంకర్లను సిద్ధం చేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించారు. ఐదు చోట్ల సీసీ కెమెరాలు: బల్దియా ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ఐదు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి, కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, హనుమకొండ బంధం చెరువు, హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేశారు.
- అదేవిధంగా అన్ని నిమజ్జన ప్రాంతాల్లో ఎన్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. విద్యుత్ ఎం వినియోగించారో పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రధాన చెరువుల వద్ద బల్దియా జనరేటర్లను అందుబాటులో ఉంచుతారు.
- ఆర్అండ్‌బీ శాఖ నేతృత్వంలో ఆరు కేంద్రాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు.
- మత్స్య శాఖ 1,200 మంది గజ ఈతగాళ్లు, 26 తెప్పలు, బ్యాలెన్సింగ్‌ల ద్వారా సేవలు అందించనున్నారు.
- రెవెన్యూ శాఖ ద్వారా ఐదుగురు తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏర్పాట్లలో తలమునకలయ్యారు.
- మెడికల్ అండ్ హెల్త్ శాఖ ప్రతీ నిమజ్జన కేంద్రం వద్ద ఉచితంగా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా 108 వాహనాలను ఆయా సెంటర్లలో ఏర్పాటు చేయనున్నారు. గురువారం తెల్లవారు జాము వరకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సేవలు అందించనున్నారు.

ఆర్అండ్‌బీ: అన్ని చోట్ల బారికేడ్లు

- **మెడికల్ అండ్ హెల్త్:** ఉచిత వైద్య శిబిరాలు, 108 వాహనాలు అందుబాటులో ఉంచారు.
- **పోలీస్ శాఖ:** బందోబస్తు, శాంతిభద్రత పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణను పకడ్బందీగా నిర్వహించనున్నారు.

చెరువుల పరిశీలన..



చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్, సీపీ, కలెక్టర్, కమిషనర్



సిద్ధేశ్వర గుండం వద్ద సూచనలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్/ఖిలావరంగల్ : గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గురువారం సాయంత్రం వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి, ఉర్సు రంగసముద్రం, పడమరకోట మాల అగర్త, బెస్తం చెరువు, కట్టమల్లన్న చెరువుల వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను మేయర్, పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, వివిధ శాఖల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించింది. హనుమకొండలోని సిద్దేశ్వర గుండం, బంధం చెరువులను కలెక్టర్ స్నేహ శబరీష్, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పర్యవేక్షించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ చెరువుల వద్ద ఏర్పాట్ల కోసం రూ.1.50 కోట్లు నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

2,100 మందితో పటిష్ట బందోబస్తు : సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. కమిషనరేట్ పరిధి మూడు జోన్లలో నలుగురు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 15 మంది ఏసీపీలు, 53 మంది ఇన్‌స్పెక్టర్లు, 70 మంది ఎస్సైలతో పాటు ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో కలిపి మొత్తం 2,100 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రత్యేకించి ట్రై సిటీ పరిధిలో 1,600 మందికిపైగా పోలీసులు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. శోభాయాత్రతోపాటు నిమజ్జనం సజావుగా కొనసాగేందుకు అధిక సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. శోభాయాత్ర నిర్వహించే మార్గంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా శుక్రవారం నుంచి ట్రాఫిక్ మళ్లింపు కొనసాగించడంతో పాటు అన్ని ముఖ్యమైన జంక్షన్లతో పాటు ముఖ్యమైన మార్గాల్లో సిబ్బందిని నియమించినట్లు వివరించారు. ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉయోగించాలని, డీజేలు పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు.

కోట చెరువులో నిమజ్జనం నిషేధం

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కోట చెరువులో ఈ ఏడాది కూడా గణేశ్ విగ్రహాల నిమజ్జనం నిషేధించారు. ఈ చెరువుకు బదులుగా సమీపంలో గల దేశాయిపేటలోని చిన్నవడ్డేపల్లి చెరువులో ఏర్పాట్లు చేశారు.

లడ్డూ @ రూ.2,50,116



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని వాసవి కాలనీలో వినాయక మండపంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడి లడ్డూను గురువారం వేలం నిర్వహించారు. భక్తుడు మురార్కర్ నవీన్‌కుమార్ రూ.2,50,116కు దక్కించుకున్నారు. వినాయక ట్రస్ట్ ప్రతినిధులు సాదుల దామోదర్, మంచాల కృష్ణమూర్తి, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి చేతుల మీదుగా నవీన్‌కుమార్ లడ్డూ అందుకున్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. భద్రకాళి ఆలయ మాఢ వీధుల నిర్మాణం, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ, వేయి స్తంభాల ఆలయం, సివిల్ సప్‌లైగో దాంలు, కాజీపేట ఆర్వోబీ నిర్మాణం తదితర పనుల్ని పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రమేశ్‌రాథోడ్, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న వరంగల్ కలెక్టర్, అధికారులు

న్యూశాయంపేట: ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఇంజనీరింగ్ బృందం ప్రిలిమినరీ సర్వేలో భాగంగా గురువారం మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించింది. అనంతరం బృంద సభ్యులు వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో ఏఏఐ ఏజీఎంలు నటరాజ్, మనీష్ జోన్వాల్, మేనేజర్లు ఓం ప్రకాశ్, రోషన్ రావత్, ఎన్పీడీసీఎల్, ఇరిగేషన్ ఎస్ఈలు గౌతంరెడ్డి, రాంప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు

కాజీపేట అర్బన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి, వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు లోకల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు గురువారం కన్స్యూమర్స్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం చైర్‌పర్సన్ ఎన్వీ.వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. లోకల్ కోర్టులను ఈనెల 6 నుంచి 19వ తేదీల్లో ఎన్పీడీసీఎల్ పరిధి వరంగల్, హనుమకొండ, పెద్దపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, కరీంనగర్ సర్కిళ్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులను వినియోగించుకోవాలని సూచించారు.

లోకల్ కోర్టులు నిర్వహించే ప్రదేశాలివే..

6వ తేదీ: హనుమకొండ సర్కిల్, భీమదేవరపల్లి, నారాయణగిరి, కొత్తకొండ
12న: వరంగల్ సర్కిల్, నర్సంపేట, చెన్నారావుపేట, నెక్కొండ
16న: మహబూబాబాద్ సర్కిల్, డోర్నకల్, కురవి, కొత్తపేట

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు వీరే..

- నేడు హైదరాబాద్‌లో సీఎం చేతులమీదుగా అవార్డులు
- వృత్తిలో వారి సేవలు గుర్తించి ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం



ఎన్.ప్రసాద్ | మల్లారం అరుణ | ప్రశాంతి | మాలోతు గన్‌సింగ్, ఎన్.మల్లయ్య, గడ్డం వెంకన్న

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డుల జాబితాను గురువారం ప్రకటించింది. గురుపూజోత్సవం రోజున (నేడు, శుక్రవారం) వీరికి హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జరిగే వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు. ఇందులో కేయూలోని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారం అరుణ, ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రశాంతి, హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోతు గన్‌సింగ్ హనుమకొండ జిల్లాలోని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హిస్టరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.మల్లయ్య ఎంపికయ్యారు.

పరిశోధనల్లో మేటి..

కేయూలోని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ పరిశోధనల పరంగా 12 పేటెంట్లు కలిగి ఉన్నారు. వీటిలో క్యాన్సర్ బయాలజీపై పరిశోధనలు చేశారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో క్యాన్సర్ థెరఫీ పోస్ట్ డాక్టరల్ ఫెలోగా, స్టాన్‌ఫోర్డ్ రీసెర్చ్ ఇంటర్నేషనల్‌లో పని చేశారు. ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా హాస్టళ్ల డైరెక్టర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రసాద్ పర్యవేక్షణలో ఏడుగురు పీహెచ్‌డీ పూర్తి చేశారు.

బోధనలో ఘనాపాటి

హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారం అరుణ రెండు జాతీయ సదస్సులు నిర్వహించారు. కెమిస్ట్రీకి సంబంధించిన పది పాఠ్య పుస్తకాలు రచించారు. టీసాట్ నిపుణ విద్య చానల్‌లో 12 ప్రత్యక్ష ప్రసారాలు అందించారు. ఆమె పర్యవేక్షణలో విద్యార్థులు జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టు పోటీల్లోనూ మొదటి బహుమతి సాధించారు.

లేరెవ్వరు సాటి..

ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రశాంతి విద్యార్థులకు సృజనాత్మక డిజిటల్ పద్ధతుల ద్వారా కెమిస్ట్రీ బోధిస్తున్నారు. విద్యార్థులకు ఉపయుక్తమైన మూడు పుస్తకాలు రాశారు. పరిశోధనల పరంగా రెండు పేటెంట్లు కలిగి ఉన్నారు. ఆమెకు సంబంధించిన 22 రీసెర్చ్ పేపర్లు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

సామాజిక సేవ.. ఆయన తోవ..

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోతు గన్‌సింగ్ బోధనతో పాటు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు. హరితహారం ఇన్‌చార్జ్‌గా సేవలు అందిస్తున్నారు.

'ప్రాజెక్టు'ల రూపకల్పనలో దిట్ట

హనుమకొండ జిల్లా పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని హిస్టరీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.మల్లయ్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈమేరకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా కూడా అవార్డు ఇప్పటికే అందుకున్నారు. ఐదు పుస్తకాలు రాశారు. జిజ్ఞాస స్టూడెంట్స్ స్టడీ ప్రాజెక్టులను రూపొందించడంలోనూ దిట్ట. 25 పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమాయ్యయి.

అంతరించిపోతున్న కళారూపాలకు జీవం

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్‌లోని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న గత 30 ఏళ్లుగా గిరిజన విజ్ఞానపీఠంలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. పటం కథలు, కథకులు అనే అంశంపై పరిశోధనచేసి గ్రంథాన్ని వెలువరించారు. అంతరించిపోతున్న జానపద గిరిజన కళారూపాలను, కళాకారులను గుర్తించి పలు కళారూపాలను ఆడియో, వీడియో ఫొటో మాధ్యమాల్లో డాక్యుమెంటేషన్ చేశారు. జానపద గిరిజన విజ్ఞాన బహుముఖ అంశాలపై ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ జిల్లాల్లో పర్యటించి 20కి పైగా పుస్తకాలు రాశారు. వివిధ జర్నల్స్‌లో, పుస్తకాల్లో 70 వరకు వ్యాసాలు రాశారు. జాతీయ స్థాయి సదస్సుల్లో 50 వరకు పరిశోధన పత్రాలు సమర్పించారు.

సులభ గణితం.. ఆ సార్ స్పెషాలిటీ


విద్యార్థులకు గణితంలో సమస్యలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్

జనగామ రూరల్: ఈ ఫొటోలో విద్యార్థులతో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు అల్లూరి రవీందర్. జనగామ మండలం ఓబుల్ కేశ్వాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గణిత శాస్త్రం బోధిస్తున్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు గణితం అంటే భయం. వారిలో ఆ భయాన్ని తొలగిస్తేనే ఆ శాస్త్రం నేర్చుకోవడానికి ఆసక్తి కనబర్చుతారు. దీనిని గమనించిన టీచర్ రవీందర్.. 12 సంవత్సరాల నుంచి గణితం సులువుగా అర్థమయ్యేందుకు ఆ శాస్త్ర నమూనాలు తయారు చేసి బోధిస్తున్నారు. బట్టీపట్టే విధానం కాకుండా కృత్యాధార పద్ధతిలో గణితం బోధించడం ఆయన ప్రత్యేకత. 200కి పైగా గణిత మోడల్స్ తయారు చేసి బోధన సమయంలో ఉపయోగిస్తున్నానని రవీందర్ చెబుతున్నారు. కాగా, బెంగళూరు, చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో రవీందర్ రెండు సార్లు బహుమతులు గెలుచుకున్నారు.

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయుడు


వ్యాన్‌లో పాఠశాలకు విద్యార్థులను తీసుకొస్తున్న ఉపాధ్యాయుడు


గూడూరు: అతనో మారుమూల ఏజెన్సీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ఎక్కడ పనిచేసినా విద్యాభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తారు. అతనే గూడూరు మండలం రాజనపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ. యాకూబ్. పాఠశాలలో పిల్లల సంఖ్య పెంచాలనుకున్న సహచర ఉపాధ్యాయుల నిర్ణయానికి యాకూబ్ తన అభిప్రాయం తెలిపారు. తాను సొంత డబ్బులు రూ. లక్షా 50 వేలు వెచ్చించి ఓ వ్యాన్ కొనుగోలు చేశారు. అంతేకాకుండా విద్యార్థులను రోజూ పాఠశాలకు తీసుకొచ్చి సాయంత్రం ఇంటి వద్ద చేర్చుతూ తానే వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. దీంతో గతంలో ఆ పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, వ్యాన్ కొనుగోలు తర్వాత ఆ సంఖ్య 75కి పెరిగింది. కాగా, విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుడే డ్రైవర్‌గా మారడంపై ఉన్నతాధికారులు గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

గురుభ్యోనమః



నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

- ప్రభుత్వ పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లు
- నాణ్యతగా, వినూత్నంగా బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు



పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. నాణ్యత, వినూత్నంగా బోధిస్తేనే విద్యార్థులకు అర్థమవుతుంది. అప్పుడే వారు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు. మంచి పౌరులుగా దేశ, సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. ఈ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి కొందరు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తూ వెలుగులు నింపుతున్నారు. ఈ క్రమంలో నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇలా బోధిస్తున్న పలువురు ఉపాధ్యాయులపై 'సాక్షి' స్ఫూర్తిదాయక కథనాలు.

తల్లిదండ్రులను ఒప్పించి.. విద్యార్థుల సంఖ్య పెంచి


గంగాధర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వేముల గంగాధర్ విద్యార్థుల సంఖ్య పెంచారు. నెక్కొండ ప్రాథమిక పాఠశాల నుంచి గతేడాది బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించారు. మెరుగైన బోధన చేస్తామని, ఒక సంవత్సరం అవకాశం ఇవ్వాలని వారిని కోరారు. ఇలా విద్యార్థుల సంఖ్య 10 నుంచి 36 వరకు పెంచారు. అదే విధంగా 10 మంది ఐదేళ్ల చిన్నారులు కూడా ప్రీప్రైమరీ స్కూల్‌కు వచ్చే విధంగా ఆయన కృషిచేశారు. పూర్వ విద్యార్థులు, దాతల సహకారంలో ఐడెంటిటీ కార్డులు, టైలు, బెల్టులు అందించారు. ఇక తమ గ్రామ ఉన్నత పాఠశాలకు బేస్ గట్టిగా ఏర్పడింది. మరో ఐదేళ్ల పాటు బడి బతుకుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులతో ఫిజికల్ సైన్స్ టీచర్ రాజేందర్ అద్భుతాలు..


వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు దొనికల రాజేందర్.. విద్యార్థులతో అద్భుతాలు చేసి జూన్ 29న వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశవధానంపై చేసిన అంశం ఆకట్టుకుంది. మరో 12 మంది విద్యార్థులు రసాయనశాస్త్రంలోని 118 మూలకాల పేర్లు 8 సెకన్ల వ్యవధిలో చదివారు. ఇందుకుగాను 'వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' చోటులో లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అక్షయ.. భౌతికశాస్త్రంలో ఒకేసారి పది మంది విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మధ్యలో ఇతర అంశాలతో మిళితంగా సమాధానాలు ఇవ్వడమేకాక, శాస్త్రవేత్తల పేర్లు, చిత్రాలను గుర్తుపెట్టుకొని అద్భుతంగా వివరించిన విధానం ఆకట్టుకుంది.

బడిని బాగు చేసి.. విద్యార్థులను తీర్చిదిద్ది


రాజేశ్


2018లో ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం ఒడ్డెరగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు టి.రాజేశ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. నేడు హైదరాబాద్‌లోని శిల్పారామంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. రాజేశ్ బాధ్యతలు స్వీకరించిన సమయంలో స్కూల్‌లో జీరో స్టెంత్ ఉంది. దీంతో పాఠశాలను బాగుచేసి పిల్లలను బడిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2018లో జీరో స్టెంత్ స్కూల్‌ను రీఓపెన్ చేసి రూ.40 వేలు సొంత డబ్బులు వెచ్చించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించారు. సహచార ఉపాధ్యాయుడు విజయ్‌భాస్కర్ సాయంతో ఇంటింటికీ తిరిగి 15మంది పిల్లలను బడిలోకి తీసుకొచ్చాడు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు. దీంతో 2023లో జిల్లా స్థాయిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయగా జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. జూలైలో ఢిల్లీలో జరిగిన సీసీఆర్‌టీ ట్రైనింగ్ ప్రోగ్రాంకు తెలంగాణ నుంచి 10 మంది వెళ్లగా అందులో రాజేశ్ ఉన్నారు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న బడి..


విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ భిక్షపతి (ఫైల్)

శాయంపేట: మండలంలోని కొప్పులలో నాలుగేళ్ల క్రితం మూతబడిన గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలను జూన్ 30న ఎంఈఓ భిక్షపతి తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వ విద్యను బతికించే ప్రయత్నం చేయడం అభినందనీయమని, విద్యే ప్రగతికి సోపానమని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలనే ఉద్దేశంతో ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిపించారు. నాలుగేళ్లుగా మూతబడిన బడిని ఎంఈఓ భిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకుని తెరిపించినందుకు మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సీఈఎల్ఈ రాథోర్
- కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ తనిఖీ


సీఈఎల్ఈ రాథోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో ఇంజనీర్ (సీఈఎల్ఈ) బి.పి.ఎస్.రాథోర్ అన్నారు. గురువారం సీఈఎల్ఈ షెడ్‌లో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం లోకోల నిర్వహణ పనితీరుపై విజయవాడ, లాలాగూడ, మౌలాలి, కాజీపేట డీజిల్‌షెడ్, ఎలక్ట్రిక్‌షెడ్ నుంచి పాల్గొన్న అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాగా, షెడ్ అభివృద్ధి, రైల్వే కార్మికుల సమస్యలను స్థానిక షెడ్ సీనియర్ డీఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

సీఈఎల్ఈకి నాయకుల వినతి

సీఈఎల్ఈ రాథోర్‌కు రైల్వే మజ్దూర్ యూనియన్ కాజీపేట ఈఎల్ఎస్ బ్రాంచ్ నాయకులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. షెడ్‌లో లోకోల నిర్వహణకు సరిపడా స్టాఫ్ పెంచాలని, ఈఎల్ఎస్‌కు వచ్చే మార్గంలో రైల్వే ట్రాక్‌పై ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని, వెహికిల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలనే తదితర సమస్యలను వివరించారు. దీనిపై సీఈఎల్ఈ స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం, చైర్మన్ ఇబ్రహీం తెలిపారు. కార్యక్రమంలో ఈఎల్ఎస్ బ్రాంచ్ ట్రెజరర్ బి.రవీందర్‌రెడ్డి, ఆఫీస్ బేరర్స్ వైస్ చైర్మన్ ఎస్.గోపి, ప్రభాకర్, ఎస్.స్వర్ణకుమారి, అసిస్టెంట్ సెక్రటరీ పి.రాజు, అరుణ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

12న ఆర్టీసీల పరిరక్షణ దినం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

న్యూశాయంపేట: దేశంలోని 59 ఆర్టీసీ (రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్)లను పరిరక్షించాలనే డిమాండ్‌తో ఈనెల 12వ తేదీన చేపట్టనున్న ఆర్టీసీల పరిరక్షణ దినాన్ని(సేవ్ ఆర్టీసీ) విజయవంతం చేయాలని వరంగల్ రీజియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.ఎల్లయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీలకు సంబంధించి కొన్ని విలువైన భూములు ప్రైవేట్ సంస్థలకు అప్పగించే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు 59 ఆర్టీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడం లేదని, ఫలితంగా ఆర్టీసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీంతో కార్మికులు పని భారం పెరిగి అనారోగ్యాల పాలు అవుతున్నారన్నారు. అందుకోసం ఈనెల 12న ఆర్టీసీల మనుగడ కోసం 'ఆర్టీసీల పరిరక్షణ దినం' (సేవ్ ఆర్టీసీ)డిమాండ్ డే పాటించాలని, ఆ రోజున కార్మికులందరూ నిరసన బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. రీజియన్ కార్యదర్శి బి.ఉపేంద్రాచారి, ఉపాధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, పి.మహేందర్, కొమ్మాలు, ఎండి.పాషా, సాధిక్, రవి, సంపత్, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతో కేయూ ప్రతిష్ట విశ్వవ్యాప్తం

- వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ఉత్సాహంగా ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు


మాట్లాడుతున్న వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


పాల్గొన్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌తో కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ట విశ్వవ్యాప్తమైందని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీలోని ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పరిపాలనభవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50 వసంతాల్లో ఫార్మసీ కాలేజీ స్ఫూర్తిదాయకమైన అధ్యాపకులు, విద్యార్థులను అందించిందని కొనియాడారు. ఫార్మసీలో ఇంకా మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు జరగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ విశ్రాంత ఆచార్యులు పరమేశ్వర్ మాట్లాడుతూ ఫార్మసీ కాలేజీ ఎంతోమంది గొప్ప విద్యార్థులను అందించిందని గుర్తుచేశారు. యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత జె. రాజమౌళి మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా ఈ కళాశాలను నిలబెట్టుకున్నామన్నారు. కేయూ ఫార్మసీ అలుమ్ని వైస్ ప్రెసిడెంట్ ఏవీ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం పూర్వ విద్యార్థుల సంఘం పనిచేస్తుందన్నారు. ప్రొఫెసర్ రామ్‌బహూ మాట్లాడుతూ ఫార్మసీ రంగం ఎక్కువమందికి ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. విశ్రాంత ఆచార్యులు ఎ.వి.ఎన్ అప్పారావు మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు రుణపడి ఉంటామన్నారు. విశ్రాంత ఆచార్యులు మల్లారెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులను చూసి గర్విస్తున్నామన్నారు. కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు (అకుట్) బి. వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థులు ఈ కళాశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల చైర్మన్, ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, కన్వీనర్ గాదెస మ్మయ్య మాట్లాడారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వన్నెతెచ్చిన ఫార్మసీ కాలేజీలో గొప్పపరిశోధనలకు అవకాశాలున్నాయన్నారు. ఆచార్యులు వై. నర్సింహారెడ్డి, ఎన్ ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి


గణపతి ఉత్సవ కమిటీలకు బహుమతులు అందజేస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నయీంనగర్: తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో గణపతి పూజలు నిర్వహించిన భక్తులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. గురువారం గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన గణపతి ఉత్సవ కమిటీలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వరంగల్ సీపీ, ఎమ్మెల్యే నాయిని, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. పర్యావరణాన్ని కాపాడే మట్టి గణపతి ప్రతిమలు, సంస్కృతి సంప్రదాయాల ఆచరణ, నిత్యపూజా విధానాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని 109 గణపతి మండపాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణపతి ఉత్సవ సమితి బాధ్యులు జైపాల్ రెడ్డి, నందాల చందర్ బాబు, భజరంగ్ దళ్ బాధ్యులు శివరాములు, శ్రీరామ్ ఉదయ్‌కుమార్, వెలగందుల రాజు, సాయి, వేణు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసూళ్ల కమిటీలకే 'ఉత్తమ' అవార్డులు?

హన్మకొండ అర్బన్ : నవరాత్రి ఉత్సవాల పేరుతో కొన్నిచోట్ల కమిటీలు విచ్చలవిడిగా చేస్తున్న వసూళ్ల పర్వం ఉత్సవాలు ముగింపునకు వస్తున్నా ఆగడం లేదని సమాచారం. నగరంలో ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధి నివసించే కాలనీలో గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు చేస్తున్న వసూళ్లు తారస్థాయికి చేరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది చాలదన్నట్లు ఎంతో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు పూజలు, ఉత్తమ అలంకరణ, ఉత్తమ నిర్వహణకు ఇచ్చే అవార్డులు సహితం ఆ కమిటీలకే దక్కడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ ప్రజలు పలుమార్లు గళమెత్తినా ఎవరూ స్పందించకపోగా ప్రజలనుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడిన కమిటీలకు ఉత్తములుగా సన్మానించడం, ఉత్తమ ఎంపికలను సహితం రాజకీయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక వసూళ్ల విషయాలతోపాటు ఎంపికలో జరుగుతున్న అక్రమాలపై హిందూ సంఘాల పెద్దలకు విన్నవించుకున్నా స్పందించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి కృషి


కళాకారులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ బండా ప్రకాశ్

హన్మకొండ కల్చరల్: కల్యాణ మండపం పునర్నిర్మాణానికి తోడ్పాటు నందించానని, వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధులు వచ్చేలా కృషి చేస్తానని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. వేయిస్తంభాల దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన కళాకారులకు గురువారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు గాయాలు


తీవ్ర గాయాలతో రబ్బాని పాషా

ధర్మసాగర్: రోడ్డు ప్రమాదంలో సాక్షి డెస్క్ జర్నలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్‌లో జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతానికి చెందిన మహమ్మద్ రబ్బాని పాషా రాంపూర్ శివారులోని సాక్షి వరంగల్ యూనిట్ కార్యాలయంలో డెస్క్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో రాంపూర్ శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడి ని చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రబ్బాని పాషా ఆరోగ్యం విషమంగా ఉందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గూడ్స్ షెడ్‌కు ఎరువుల రాక

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు గురువారం ఎరువులు చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాకు 2లక్షల 35వేల యూరియా బస్తాలు చేరుకున్నట్లు తెలిసింది. గురువారం ఉదయం వరంగల్ గూడ్స్ షెడ్‌కు చంబల్ కంపెనీ ఎంఓపీ(పొటాష్)1,079.400 మెట్రిక్ టన్నులు చేరుకోగా.. కోరమండల్ కంపెనీ చెందిన 28.28.0 రకం 483.300 మెట్రిక్ టన్నులు, 20,20,013 రకం 1,350.000 మెట్రిక్ టన్నుల ఎరువులు చేరుకున్నాయి. ఈ ఎరువులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్ తెలిపారు.

దేవాలయ భూముల్లో భవనాలు ఖాళీ చేయాలి

- గోవిందరాజుల గుట్ట భూమి ఆక్రమణపై దేవాదాయ శాఖ నోటీసులు


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని చారిత్రక గోవిందరాజుల గుట్ట దేవాలయ భూముల ఆక్రమణలపై మల్లగుల్లాలు పడిన దేవాదాయశాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. దేవాలయానికి చెందిన భూములపై పలుమార్లు సర్వే చేసిన అధికారులు.. రెండు రోజుల క్రితం వ్యాపార సంస్థలు, ఇళ్లవాసులకు నోటీసులు జారీ చేశారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 15/1, 15/2. 38లో సుమారు 8 ఎకరాలు ఉందని నిర్ధారించారు. అయితే సర్వేలో 5 ఎకరాల 25 గుంటలు మాత్రమే తేలింది. మిగతా స్థలంలో అక్రమంగా వ్యాపార సంస్థలు, నివాస గృహాలను నిర్మించుకున్నట్లు భావిస్తున్నారు. సుమారు 54 నిర్మాణాలుండగా, అందులో 15 వ్యాపార సంస్థలు, 39 నివాస గృహాలు ఉన్నాయి. వీరందరూ వ్యాపార సంస్థలు, నివాసాలను ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు జారీ చేయగా, కొంత మంది స్వీకరించగా, మరికొందరు నిరాకరించారు.

సీపీఎం నేతలు, గృహ యజమానుల నిరసన

గోవిందరాజుల గుట్ట చుట్టూ ఉన్న నివాస గృహాలకు దేవాదాయ శాఖ అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని ఇచ్చిన నోటీస్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయ సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. 120 ఏళ్ల క్రితం నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి 54 కుటుంబాలకు అకస్మాత్తుగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి ఆందోళన గురి చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు బాబు, మాధవి, కుమార్, శివ, సంపత్, రమేశ్,యాదగిరి, రామ సరోజన, సదానందం, గోవర్ధన్ పాల్గొన్నారు.